సాక్షి
జనగామ
గురువారం । 16 । నవంబర్ । 2023

వరంగల్ తూర్పు.. సమస్యల కూర్పు

- వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కనిపించని అభివృద్ధి
- వర్షం పడితే వరదల వలయంలో వరంగల్ సిటీ



కలి'విడి'గా..

- ఒక ఊరు.. రెండు నియోజకవర్గాలు
- ఇద్దరు ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం

- వివరాలు 10లో▸

గరిష్టం/కనిష్టం
32°/20°

వాతావరణం
జిల్లాలో ఉదయం తేమతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

జనగామ రూరల్: జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అండ్ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక సహకారంతో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ కె.రాము ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల 8, 9 తరగతి విద్యార్థులకు 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై 16న మండల స్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి 17న జనగామ పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రథమ బహుమతి రూ3,000, ద్వితీయ బహుమతి రూ.2,000 తృతీయ బహుమతి రూ.1,000 నగదు అందజేస్తామని, మరిన్ని వివరాలకు 80742 54992, 94929 07386 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



తరిగొప్పుల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని డీపీఓ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ నాగదివ్యతో కలసి ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే పునాది.. ఆ రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్‌ను మార్చేస్తుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన పౌరులందరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆగ మిస్బా అలాం, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, సీడీపీఓ రమాదేవి, ఏఈఓ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



పాలకుర్తి టౌన్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని, పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. శ్రీసోమేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బీఎస్‌ఎఫ్ జవాన్ల విడిదిని డీసీపీ సీతారాం సందర్శించారు. బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బిపిన్ జస్వాల్, ఏసీపీ రఘుచందర్, సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

పొదుపు పథకాలపై అవగాహన కల్పించాలి



జనగామ రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయాల ద్వారా కేంద్ర ప్రభుత్వ పొదుపు పథకాలపై అవగాహన కల్పించాలని హన్మకొండ పోస్టల్ సూపరింటెండెంట్ హన్మంతు అన్నారు. డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రతతో కూడిన చిన్న మొత్తాల పొదుపు, తక్కువ రేటులో ఇన్సూరెన్స్ పథకాలున్నాయని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనగామ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమాదేవి, చేర్యాల సబ్ పోస్ట్‌మాస్టర్లు ప్రసాద్ బాబు, సత్తయ్య, మహేందర్, మల్లారెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరునగరి శ్రీనివాస్–వంశీలత దంపతులు, ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సంపత్ రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, డిసెంబర్ 3 వరకు గుట్టపై గండదీపం వెలిగించనున్నట్లు శ్రీధర్‌రావు తెలిపారు.



- జనగామ నియోజకవర్గంలో స్క్రూటినీ సమయంలో 27 మంది అభ్యర్థులు మిగలగా, ఆయా పార్టీలు, స్వతంత్రులు.. బానోతు భాస్కర్, బొమ్మకంటి రమేష్, లాల సాహెబ్ మహ్మద్, అంకిళ్ల శంకర్, చెవిటి అర్జున్, నిర్మల సత్యనారాయణ, ఇ.మహిపాల్‌రెడ్డి విత్ డ్రా చేసుకోగా.. బరిలో 19 మంది మిగిలారు. నోటాతో కలుపుకుని ఇక్కడ రెండు ఈవీఎంలు ఏర్పాటు చేయనున్నారు.


రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్‌ఎస్) | కొమ్మూరి (కాంగ్రెస్) | దశమంతరెడ్డి (బీజేపీ)

కె.శ్రీహరి (బీఆర్‌ఎస్) | ఎస్.ఇందిర (కాంగ్రెస్) | జీవీఆర్ (బీజేపీ)




- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 23 మంది అభ్యర్థులకు గాను ముంద్రాతి మౌనిక, ఎడ్ల వినయ్‌కుమార్, జిలుకర విజయ్‌కుమార్, మారపాక రమేష్ పోటీ నుంచి తప్పుకున్నారు. 19 మంది పోటీలో ఉండగా.. ఇక్కడ కూడా రెండు ఈవీఎంలు ఏర్పాటు చేసే పరిస్థితి నెలకొంది.



- పాలకుర్తి నియోజకవర్గంలో 22 మంది అభ్యర్థులకు.. రాజ్‌కుమార్ నేనావత్, లకావత్ విజయ్ కుమార్, ఉషాదేవి ఎర్రబెల్లి, బానోతు భాస్కర్, మంద యాకమల్లు, మార్గం జగదీష్, చిలుముల సుజాత నామినేషన్లను ఉపసంహరించుకోగా.. బరిలో 15 మంది మిగిలారు. ఇక్కడ మాత్రం ఒక్క ఈవీఎంతోనే పోలింగ్ నిర్వహించనున్నారు.


దయాకర్‌రావు (బీఆర్‌ఎస్) | యశస్వినిరెడ్డి (కాంగ్రెస్) | రామ్మోహన్‌రెడ్డి (బీజేపీ)

బరిలో 53 మంది

- నామినేషన్లు ఉపసంహరించుకున్న 19 మంది అభ్యర్థులు
- పోటీలో ఉన్నవారికి గుర్తుల కేటాయింపు
- జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రెండు చొప్పున ఈవీఎంలు

జనగామ: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బుధవారంతో నామినేషన్ల విత్ డ్రా ప్రక్రియ ముగిసింది. బరిలో 53 మంది అభ్యర్థులు మిగిలారు. ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా.. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 99 మంది పత్రాలు దాఖలు చేశారు. 13న చేపట్టిన స్క్రూటినీలో 27 మంది పత్రాలు తిరస్కరణకు గురికాగా.. 72 మంది మిగిలారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఆర్వోలు మురళీకృష్ణ, రామ్మూర్తి, రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో 14, 15 తేదీల్లో 19 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పోటీలో మిగిలిన వారికి అధికారులు గుర్తులను కేటాయించారు.

బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు

జనగామ నియోజకవర్గంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి(బీఆర్ఎస్), కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి(కాంగ్రెస్), ఆరుట్ల దశమంతరెడ్డి(బీజేపీ), మోకు కనకారెడ్డి(సీపీఎం), స్టేషన్‌ఘన్‌పూర్.. కడియం శ్రీహరి(బీఆర్ఎస్), సింగపురం ఇందిర(కాంగ్రెస్), గుండె విజయ రామారావు(బీజేపీ), పాలకుర్తి.. ఎర్రబెల్లి దయాకర్‌రావు(బీఆర్ఎస్), యశస్వినిరెడ్డి(కాంగ్రెస్), లేగ రామ్మోహన్‌రెడ్డి(బీజేపీ) బరిలో ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ మాటలు నమ్మొద్దు

- జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి


మాట్లాడుతున్న ఆకునూరి మురళి

జనగామ: బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దు.. ఫాసిస్టు పాలన సాగిస్తున్న మోదీ, అవినీతి నియంతృత్వ కేసీఆర్ ప్రభుత్వాలను ఓడించాలని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్టీసీ చౌరస్తా, బతుకమ్మ కుంటలో ఆయన వాకర్స్, ప్రజలతో మాట్లాడారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలపై విషం చిమ్ముతున్న సీఎం కేసీఆర్ కుటుంబం కుంభకోణాలకు కేరాఫ్‌గా మారిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకంలో లెక్కలేని అవినీతి, అక్రమాలు జరిగాయని.. కుంగిపోతున్న ప్రాజెక్టే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను సర్వనాశనం చేశారని, నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని చెప్పారు. నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కార్మికులకు కనీస వేతనాలు అందించలేని అసమర్థ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను వమ్ముచేసిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడకపోతే చారిత్రక తప్పు చేసిన వారిగా మిగిలిపోతామని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారు.. విదేశాల్లో ఉన్న నల్ల ధనం బయటకు తీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని చెప్పి విఫలమైందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల ఊసే లేకుండా పోయిందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.16లక్షల కోట్లు రుణ మాఫీ చేసి.. పేద, మధ్య తరగతి కుటుంబాలను కులాలు, మతాల పేరుతో రెచ్చ గొట్టే విధానాలు అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పద్మజాషా, వినాయక్‌రెడ్డి, రమ, నైనాల గోవర్ధన్, సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ, డాక్టర్ ప్రీతి దయాళ్, పి.శంకర్, పులి కల్పన, స్వరూప, నిర్మల సంధ్య, సౌజన్య, గౌస్, బాలు, రాము, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫణికాంత్‌కు ట్రావెల్‌గ్రాంట్ అవార్డు


ఫణికాంత్‌ను అభినందిస్తున్న వీసీ

కేయూ క్యాంపస్: కేయూలోని బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు డాక్టర్ జోగం ఫణికాంత్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) సెర్బ్ ఇంటర్నేషనల్ ట్రావెల్ గ్రాంట్ అవార్డు లభించింది. ఈనెల 28 నుంచి డిసెంబర్ 2వరకు కోల్డ్ స్ప్రింగ్ హార్బర్ ల్యాబొరేటరీ న్యూయార్క్ అమెరికాలో జరిగే కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఈఅవార్డు లభించినట్లు ఫణికాంత్ తెలిపారు. ఈట్రావెల్ గ్రాంట్ అవార్డుతో అమెరికా ప్రయాణ ఖర్చులు, రిజిస్ట్రేషన్ ఫీజు, వీసా చార్జీలు డీఎస్‌టీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సమకూర్చనుంది. ఫణికాంత్‌ను బుధవారం క్యాంపస్‌లో వీసీ తాటికొండ రమేశ్ అభినందించారు. కాగా.. డాక్టర్ ఫణికాంత్ సీఎస్ఐఆర్ పోస్టు డాక్టరల్ ఫెల్లోగా.. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏవీ రావు పర్యవేక్షణలో పనిచేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రజారాజ్యం స్థాపిద్దాం


సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతాం
- చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తాం
- కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ప్రజాసేవకుడిగా గెలిపించండి
- టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డి

జనగామ: ఉద్యమాల పురిటిగడ్డ జనగామ ప్రజలు కాంగ్రెస్ ప్రజారాజ్య స్థాపనకు పాటుపడాలని టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రం ప్రెస్టన్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సభకు తరలివచ్చిన జనాన్ని చూసిన రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ పాపాలభైరవుల్ని కాటెయ్యడానికి వచ్చిన కాలనాగులుగా అభివర్ణిస్తూ.. జనగామ అభ్యర్థిగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామనే నమ్మకం చూపించారని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎమ్మెల్యే, మంత్రి, టీపీసీసీ చీఫ్‌గా గౌరవిస్తే పొన్నాల లక్ష్మయ్య వృద్ధాప్యంలో పార్టీ మారి పరువు తీసుకున్నాడని అన్నారు. బీఆర్ఎస్ తరఫున జనగామ బరిలో నిలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై ఆరోపణలు గుప్పించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై.. ఆయన చేసిన కబ్జాల చిట్టాను సొంత కూతురు కుండబద్దలు కొట్టిందని, ఇటువంటి నాయకులను కేసీఆర్ తన పక్కన పెట్టుకుని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనతో శతాబ్దానికి సరిపడా రూ.లక్షలకోట్లు దండుకున్న సీఎం కేసీఆర్.. ధనదాహం సరిపోనట్టుగా అనేక పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను అమ్ముకున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని అన్నారు. ఈసారి ప్రజలు ఇచ్చే తీర్పుతో రాష్ట్రంలో పెనుతుపాను రాబోతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. కొమ్మూరిని ప్రజాసేవకుడిగా గెలిపిస్తే స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు పాలిటెక్నిక్, మహిళా డిగ్రీ కళాశాల, చేర్యాల రెవెన్యూ డివిజన్ సత్వరమే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు మండలాలకు చెందిన వారు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

స్థానికేతరులను పంపిన కేసీఆర్ : కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న కొమ్మూరి

పదేళ్ల క్రితం జనగామకు స్థానికేతరుడు ముత్తిరెడ్డిని పంపించిన కేసీఆర్ మరో స్థానికేతరుడైన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పంపాడని కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. తనను గెలిపిస్తే.. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి పాటుపడుతానని.. చేర్యాల రెవెన్యూ డివిజన్, జనగామ పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తానని కొమ్మూరి హామీ ఇచ్చారు. కాబోయే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జనగామలో పీజీ కళాశాల, మహిళా విశ్వవిద్యాలయం నెలకొల్పేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం రేవంత్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, టీపీసీసీ, మాజీ ప్రతినిధులు, నాయకులు ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, పోరిక బలరామ్‌నాయక్, డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, సిరిసిల్ల రాజయ్య, గౌర్రె సిద్ధయ్య, వేముళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమళ్ల సుధాకర్, మేడ శ్రీనివాస్, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వంగాల కల్యాణిమల్లారెడ్డి, బడికె ఇందిర, కామునిజయశ్రీనివాస్, గాదెపాక రామచంద్రం, అభిగౌడ్, బనుక శివరాజ్, గంగరబోయిన మల్లేషం, దిలీప్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ సభకు హాజరైన ప్రజలు, పార్టీ కార్యకర్తలు

జంపయ్యకు న్యాయం చేయాలని ధర్నా


అలింపూర్‌లో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బచ్చన్నపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్న అలింపూర్‌కు చెందిన గుండని జంపయ్యకు న్యాయం చేయాలని అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ బావి వద్ద ఎల్‌టీ విద్యుత్ వైరుకు కేబుల్ లాగాల్సి ఉండగా కేవలం సర్వీస్ వైరు బిగించడంతో అది లోడ్ ఆపక తెగిపోయి రైతు జంపయ్యకు కరెంట్ షాక్ తగిలిందని అన్నారు. ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సై కంకల సతీష్ అక్కడికి చేరుకుని.. ఏదైనా విషయం ఉంటే అధికారులతో మాట్లాడుకోవాలని నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. ఎంపీటీసీ మసూద్, కరుణాకర్‌రెడ్డి, అంబాదాస్, తిరుపతిరెడ్డి, భాస్కర్, మహేందర్, ప్రవీణ్, భిక్షపతి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల వెలికితీతకు 'కళా ఉత్సవ్'

- జిల్లా విద్యాధికారి రాము


ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ

జనగామ రూరల్: విద్యార్థుల్లో దాగిన ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు కళా ఉత్సవ్ లాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని డీఈఓ కె.రాము అన్నారు. పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో 120 మంది విద్యార్థులు పాల్గొనగా 10 విభాగాల్లో 16 మంది ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో నిలిచారని, వారు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. సెక్టోరియల్ అధికారి తోట రాజు, జీసీడీఓ గౌసియాబేగం, మల్లికార్జున్, శ్రీనివాస్ రావు, రమేష్ బాబు, వసంత, అనిల్, నవీన్, వెంకటేశ్వర్లు, అశోక్, సంగీత, మాధురి పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీలత


జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిన ప్రీతి

తరిగొప్పుల: తెలంగాణ ప్రభుత్వ సమగ్ర శిక్ష జనగామ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్‌లో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు బుధవారం ప్రతిభ చాటారు. తొమ్మిదవ తరగతి విద్యార్థిని శ్రీలత విజ్యువల్ ఆర్ట్స్ త్రీ డైమెన్షనల్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. పదో తరగతి విద్యార్థిని ప్రీతి క్లాసికల్ డ్యాన్స్‌లో జిల్లా స్థాయి రెండో స్థానంలో నిలిచింది. పాఠశాల ప్రత్యేక అధికారి రజిత, ఉపాధ్యాయులు, సిబ్బంది వారిని అభినందించారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్


పాలకుర్తి: దయాకర్‌రావుకు గొర్రె పిల్లను బహూకరిస్తున్న గొల్ల కురుమలు


రాయపర్తి: మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎల్లయ్య తదితరులు

- గొల్ల కురుమలకు మరిన్ని రుణాలు
- గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తాం
- ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తా..
- ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి/రాయపర్తి: ప్రజల దీవెనలతో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతున్నారని రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పాలకుర్తిలో గొల్ల, కురుమలు నిర్వహించిన ర్యాలీ అనంతరం బషారత్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బక్క నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో దయాకర్‌రావు మాట్లాడారు. గొల్ల కురుమలను గత పాలకులు పట్టించుకోలేదని, బీఆర్‌ఎస్ సర్కారు వారికి జీవనోపాధి కల్పించడానికి సబ్సిడీపై గొర్రెల యూనిట్లు పంపిణీ చేసిందని చెప్పారు. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి పెంపునకు రూపొందించిన ఈ పథకాన్ని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వృత్తిదారులకు మరిన్ని రుణాలు ఇప్పించడానికి సీఎం పట్టుదలతో ఉన్నారని, బీఆర్‌ఎస్‌ను ఆదరించి అధికారంలోకి తేవాలని కోరారు. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను.. ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తానని దయాకర్‌రావు అన్నారు. సభలో ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదేవి, స్వచ్ఛంద సంస్థల నాయకుడు డాక్టర్ భిక్షపతి, పండుగ నారాయణ, సలేంద్ర సోమయ్య తదితరులు పాల్గొన్నారు.


సిరిసన్నగూడెంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

తండాలను పంచాయతీలు చేశాం.

పాలకుర్తి మండలంలోని సిరిసన్నగూడెం, కంభాలకుంట తండాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దుర్భరంగా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి అన్ని వసతులు కల్పించిన ఘనత బీఆర్‌ఎస్ సర్కారుదే అని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించగా.. ఎంతో మంది పేదలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నత స్థాయికి ఎదిగారని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్యాస్ సిలిండర్ రూ.400 కే ఇస్తామని అన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాయపర్తి మండలం మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కంజర్ల ఎల్లయ్య, కొలన్‌పల్లికి చెందిన 30 మంది యువకులు ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడంతోపాటు పాలకుర్తి గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు, కాంచనపల్లి వనజారాణి, గజవెల్లి అనంత, భూక్య క్రాంతి, చెన్నబోయిన రవి, సురేష్, టీఎం రంగాచారి, ఆలకుంట స్వామి, వంగాల నర్సయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చిట్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గౌడల మద్దతు..

ఎన్నికల్లో మంత్రి దయాకర్‌రావుకు గౌడల మద్దతు ఉంటుందని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన పాలకుర్తి, జనగామలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కారు గౌడల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఏటా రూ.20 కోట్ల రెంటల్ మాఫీ చేసిందన్నారు. 103 సొసైటీలను నూతనంగా తెరిపించడంతోపాటు వైన్ షాపుల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజు, గట్టు రమేష్, ఏకాంతం, విద్యాసాగర్, మూల వెంకటేశ్వర్లు, పోశాలు వెంకన్న, కమ్మగాని పరమేశ్వర్, గిరగాని సమ్మయ్య, కమ్మగాని నాగన్న పాల్గొన్నారు.

● పూరి చేస్తా.. కారు గుర్తుకు ఓటేయండి



నర్సంపేట: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోరుతూ ప్రచారంలో భాగంగా పూరిలు చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న పెద్ది స్వప్న

● రూ.400కే గ్యాస్ సిలిండర్..



కేసముద్రం : కోరుకొండపల్లిలో గ్యాస్ సిలిండర్‌తో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్

● ఉండమ్మ బొట్టు పెడతా..



భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలం దీక్షకుంట గ్రామంలో మహిళకు బొట్టు పెట్టి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కీర్తిరెడ్డి

ప్లీజ్ కాస్ట్ యువర్ ఓట్..

ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఓ చిన్నారి ఈవీఎం వేషధారణలో వినూత్న ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారం పలువురిని ఆకట్టుకుంది.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలి

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తూ నిరంకుశ పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఓటు అనే ఆయుధంతో గద్దె దించాలని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో బుధవారం నిర్వహించిన 'పదేళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కర్తవ్యాల సదస్సు'కు ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణను తాను ఒక్కడినే తెచ్చానని, చావునోట్ల తల పెట్టి తెలంగాణను సాధించానని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేశారని, ప్రవళిక ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, రాజకీయంగా బతకాలని ప్రవళిక ప్రవర్తనను సీఎం కేసీఆర్ మార్చేశారన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనకు విముక్తి రావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి గెలిపిద్దామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఉమా మురళీనాయక్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, టీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, నాయకులు అంబటి శ్రీనివాస్, బైరి రమేష్, గోపగాని శంకర్‌రావు, ఖాజాపాషా, శ్రీనివాసులు, గోవర్ధన్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

కలి'విడి'గా..

● తండాను వేరు చేస్తున్న రహదారి
● ఎదురెదురుగా తండ్రి, కుమారుడి ఇళ్లు
● ఓ వైపు డోర్నకల్, మరోవైపు ఇల్లెందు నియోజకవర్గాలు
● ఫలితం ఒకే తండా..ఇద్దరు ఎమ్మెల్యేలు



ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న లచ్చాతండా

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 71 ఇళ్లు, 213 మంది ఓటర్లు కలిగిన ఓ చిన్న తండాకు ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఐదవ వార్డు పరిధి లచ్చాతండా మధ్యలో సీసీ రోడ్డు ఉంటుంది. తండాలోకి వెళ్తుండగా కుడివైపున డోర్నకల్ మున్సిపాలిటీ ఐదవ వార్డు పరిధిలో 40 ఇళ్లు ఉండగా, 140 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోకి వస్తారు. రోడ్డుకు ఎడమ వైపున లచ్చాతండా ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం, బర్లగూడెం పరిధిలోని 10వ వార్డులో ఉండగా ఇక్కడ 31 ఇళ్లు, 73 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడి ఓటర్లంతా ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో ఉన్నారు. తండాలో ఒకే కుటుంబానికి చెందిన వారు విడిపోయి రోడ్డుకు ఇరు పక్కల ఇళ్లు నిర్మించుకోవడంతో తండ్రి కుటుంబం ఓ నియోజకవర్గంలో, కుమారుడి కుటుంబం మరో నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు ఈ తండాకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి డీఎస్ రెడ్యానాయక్, ఇల్లెందు నుంచి హరిప్రియ ప్రాతినిధ్యం వహించారు.

ఎర్రమట్టితండా..

డోర్నకల్ మున్సిపాలిటీ మూడో వార్డు పరిధిలోని ఎర్రమట్టి తండా, గార్ల మండలం రాజుతండా గ్రామపంచాయతీలు కలిసి ఉన్నాయి. రోడ్డుకు ఓ వైపు ఎర్రమట్టితండా, మరో వైపు రాజుతండా ఉండగా రెండు తండాలను విడదీస్తూ మధ్యలో రోడ్డు ఉంది. అయితే తండాలు కలిసి ఉన్నా డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో ఉండడం గమనార్హం.

చికిత్స పొందుతూ ప్రేమికుల మృతి



శిరీష(ఫైల్)



రాజేష్ (ఫైల్)

ఏటూరునాగారం/మంగపేట: తమ ప్రేమను పెద్దలు అంగీకరించి పెళ్లి చేస్తారో లేరోనని మనస్తాపానికి గురైన ప్రేమికులు పురుగుల మందు తాగిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది.. ఏటూరునాగారం మండలానికి చెందిన బెజ్జంకి వేణుగోపాల్, అరుణ దంపతుల కుమారుడు రాజేష్(25), మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన మాదరి శిరీష(22) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ ఏటూరునాగారం డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో పెద్దలు తమ వివాహం చేస్తారో లేదో అని అపోహపడి మంగళవారం రాత్రి మల్లూరు గుట్ట వద్ద పురుగులమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఇరు కుటుంబ సభ్యులు.. వారిద్దరిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై మంగపేట ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరంగల్ తూర్పు.. సమస్యల కూర్పుగా కనిపిస్తోంది. ఈ నియోజకవర్గంలో వానాకాలంలో వర్షం వచ్చిందంటే చాలు.. నగరవాసులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కూడా వరదతతో నరకయాతన అనుభవించారు. వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశామని చెబుతున్నా ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. చివరకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన వరంగల్ మోడ్రన్ బస్టాండ్, సమీకృత కలెక్టరేట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉర్సు గుట్ట బండ్ పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన రహదారులు నిర్మించినా.. డ్రెయినేజీలు అసంపూర్తిగా వదిలేశారు.

- సాక్షి, వరంగల్, వరంగల్ అర్బన్

వరంగల్ తూర్పు.. సమస్యల కూర్పు



గ్రౌండ్ రిపోర్ట్ వరంగల్ తూర్పు

అభివృద్ధికి నోచుకోని పాత బీట్ బజార్

వేల కోట్లు ఖర్చు చేస్తున్నా కనిపించని అభివృద్ధి

● వర్షం పడితే వరదల వలయం.. వరంగల్ సిటీ
● మొదలుకాని ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు
● సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు అంతంతే..
● మూడేళ్లైనా మొదలుకాని ఉర్సుగుట్ట బండ్ పనులు
● వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులే కాస్త బెటర్..



దూపకుంటలో నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు అందజేయని 'డబుల్'ఇళ్లు



పిల్లర్ల దశలోనే కనిపిస్తున్న వరంగల్ కలెక్టరేట్ నిర్మాణం



నిరుపయోగంగా ఉన్న తాత్కాలిక బస్టాండ్



నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఏయే పనులు... ఎక్కడ అంటే..

- నియోజకవర్గంలో వరద ముంపు బెడద ఎక్కువగా ఉంది. వానొస్తే చాలు కొన్ని కాలనీలు నీట మునుగుతున్నాయి. వర్షాకాలంలో లోతట్టు కాలనీల ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బొంది వాగు నాలా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసినా పనులు మొదలు కాలేదు.
- వరంగల్ ప్రాంతంలో ముఖ్యమైన జంక్షన్ల అభివృద్ధి అంతంతా మాత్రమే. ఏ జంక్షన్‌లో కూడా పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. ఫలితంగా ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రజలు సతమతమవుతున్నారు.
- వరంగల్‌లోని పాత బస్తీల్లో ఇరుకు రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. బల్దియా ఇంజనీర్ల నిర్లక్ష్యం వల్ల అంతర్గత రోడ్ల అభివృద్ధి జరగడం లేదు.నిజాం కాలం నాటి డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్వల్ప వర్షానికి కూడా నీరు సాఫీగా ముందుకు సాగక రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి.
- వరంగల్ లక్ష్మీపురంలోని 4.16 ఎకరాల విస్తీర్ణంలో రూ. 24 కోట్లతో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేపట్టారు. పనులు మొదలై నెలలు గడిచాయి. అయినా పనులు స్లాబ్ వరకు మాత్రమే పూర్తయ్యాయి. ఈ పనులు పూర్తయ్యేసరికి మరో ఏడాది కాలం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.
- వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునికీకరణ కోసం రూ.73 కోట్లు వెచ్చించారు. పనులు ప్రారంభించి ఆరు నెలలు గడిచినా పాత బస్ స్టేషన్ కూల్చివేత ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.
- వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పనుల ఊసేలేదు.
- వరంగల్ ఎంజీఎం నుంచి కాశిబుగ్గ, లేబర్ కాలనీ, వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్, హెడ్ పోస్టాఫీస్, ఆర్ఎన్‌టీ రోడ్డు, మేదరవాడ, జేపీఎన్ రోడ్డు, మండి బజార్ నుంచి పోచమ్మమైదాన్ వరకు 11 స్మార్ట్‌సిటీ రోడ్ల నిర్మాణానికి రూ.66.55 కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయి. కాగా, సీసీ రోడ్డు, భూగర్భ డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయి. అయితే డ్రెయినేజీ పైపులైన్ల చాంబర్లపై కప్పులు అక్కడక్కడ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఫుట్ పాత్‌లు నిర్మాణాలు అక్కడక్కడ ప్రారంభించి మధ్యలో వదిలేశారు. బట్టల బజార్ ఫ్లై ఓవర్ కరీమాబాద్ నుంచి ఉర్సు మీదుగా గవిచర్ల క్రాస్ వరకు స్మార్ట్‌సిటీ రోడ్లు, భూగర్భ డ్రెయినేజీకి రూ.16.55 కోట్లతో చేపట్టిన పనులు అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి. కరీమాబాద్ రోడ్డు నుంచి ఉర్సు గుట్ట వరకు దసరా స్మార్ట్‌సిటీ రోడ్డు రూ.5.78 కోట్లతో చేపట్టిన పనులు సగం వరకే పూర్తయ్యాయి.
- వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో రూ.1.250 కోట్లతో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు మాత్రం జోరుగా కొనసాగుతున్నాయి.
- ఈ నియోజకవర్గంలో లీకేజీల సమస్యతో ప్రజలకు అరకొర తాగునీరు సరఫరా అవుతోంది.
- వరంగల్ కలెక్టరేట్‌ను రూ.22 కోట్లతో నిర్మిస్తున్నారు. పిల్లర్ల దశలో పనులు కొనసాగుతున్నాయి.
- పారిశుద్ధ్య సమస్య ప్రజలను వెంటాడుతోంది.
- ఉర్సు రంగసముద్రం బండ్ అభివృద్ధి పనులు రూ.16 కోట్లతో టెండర్లు పిలిచినా ఇంత వరకు పనులు మొదలు కాలేదు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి



వరంగల్ తూర్పు నియోజకవర్గంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దశాబ్దాలుగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామనే హామీ నెరవేర్చాలి. స్మార్ట్‌సిటీ నిధులతో నియోజకవర్గాన్ని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాలి. పాదాచారులకు ఫుట్‌పాత్‌లు నిర్మించాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

- సాంబరాజు చక్రపాణి, వినియోగదారుల మండలి అధ్యక్షుడు

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలి



నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పక్కాదారి పడుతున్నారు. పరిశ్రమలు స్థాపించి, ఉపాధి కల్పించి వారిలో కొనుగోలు శక్తి మెరుగయ్యేలా కృషి చేయాలి. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు మెరుగుపర్చాలి. అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో కూరగాయాల మార్కెట్ ఏర్పాటు చేయాలి.

- సూరినేని రామారావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

అస్త్రశస్త్రాలు..

డబ్బు, మద్యం, అంగబలం, వాగ్దానం, ఫిరాయింపులు

● ఎన్నికలను శాసిస్తున్న పంచభూతాలు ఇవే..
● వీటినే నమ్ముకున్న నాయకులు
● అన్ని పార్టీల్లోనూ అదే తీరు



కాజీపేట : గాలి, నీరు, ఆకాశం, భూమి, అగ్ని.. ఇవీ పంచభూతాలు. సమస్త జంతు, వృక్ష, జీవ మనుగడకు ఇవే ఆధారం. వీటితోనే ప్రకృతి తన ధర్మం నిర్వర్తిస్తుంది. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా మనుగడ అసాధ్యం. అదే కోవలో వివిధ ఎన్నికల్లో విజయం సాధించడానికి పోటీల్లో ఉన్న అభ్యర్థులు మరో పంచభూతాలను నమ్ముకుంటున్నారు. అవే డబ్బు, మద్యం, అంగబలం, వాగ్దానం, ఫిరాయింపులు. ప్రతి ఎన్నికల్లో ఇవీ పంచభూతాలై రాజకీయాలను శాసిస్తున్నాయి. నాయకులు.. ఓటర్లను అనేక రకాలు ప్రలోభపెట్టి మసిపూసి మారెడుకాయ చేస్తున్నారు. ఫలితంగా ఈ పంచభూతాలు కలిగిన వాడే రాజకీయ నాయకుడు అనే నానుడి నడుస్తోంది.

నోటు.. ఓటు

డబ్బుకు ఓటరు దాసోహం అన్నట్లు నోటు ఇచ్చి ఓటు వేయించుకునే పరిస్థితి కనిపిస్తోంది. మనిషికి పంచభూతాల్లో భూమి ఎంత అవసరమో రాజకీయాల్లో డబ్బుకు అంత ప్రాధాన్యం ఉంది. దీంతో రూ. కోట్లను ఖర్చు చేస్తూ ఎన్నికల్లో గెలువడానికి నాయకులు యత్నిస్తున్నారు.



మద్యం.. మంచినీళ్లతో సమానం

పంచభూతాల్లో నీరు ఎంత ముఖ్యమో..రాజకీయ పంచభూతాల్లో మద్యానికి అంతకుమించి ప్రాధాన్యం ఉంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంతో ఆరంభించి విజేతలుగా మారే వరకు మద్యాన్ని ఏరులై పారించడం పరిపాటిగా మారుతోంది. ఓటరుకు మద్యం ఇచ్చి ఓటు వేయించుకునే పరిస్థితులే ఎక్కువగా ఉన్నాయి. మద్యం .. బీరు, బ్రాందీ, విస్కీ తదితర వివిధ రూపాల్లో ఓటర్లకు చేరుతోంది.

అంగబలం.. అవసరం

బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టు రాజకీయ నాయకులకు అంగబలం లేకపోతే అన్ని చచ్చుబడిపోయినట్టే. అందుకే తమ చుట్టూ ఎప్పుడూ 10 మంది ఉండేలా ప్రైవేట్ సైన్యాన్ని పెంచి పోషిస్తుంటారు. టికెట్ వస్తే ప్రచారానికి, రాకపోతే దిష్టిబొమ్మలు దహనం చేయడానికి వీరిని ఉపయోగిస్తారు. లేదంటే ఎదుటి వ్యక్తులను భయపెట్టడానికి అవసరం. ఈ భూతం లీడర్‌కు ప్రాణవాయువుతో సమానం.

నిప్పులాంటి భూతం వాగ్దానం..

రాజకీయాల్లో నిప్పులాంటి భూతామే వాగ్దానం. అరచేతిలో స్వర్గం చూపిస్తూ ఓటరును ప్రలోభ పెట్టడంలో మన నాయకులు ఆరితేరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల దాకా బూడిదను చూపించి మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు కనిపించకుండా పోవడం ఈ వాగ్దాన భూత రాజకీయ లక్షణం. ఇళ్లు, స్థలాలు, ఇన్సూరెన్స్, ఉచిత పథకాల పేరుతో వాగ్దానాలు చేయడం ఈ భూతం ఓటర్లను ప్రలోభపెడుతోంది.

ఫిరాయింపులు..

రాజకీయాల్లో గాలిలాంటి ఐదో భూతమే ఫిరాయింపులు. ఈ భూతం గోడ మీది పిల్లిలా, తక్కెడలోని కప్పలాంటి లక్షణాలతో ఉంటుంది. టికెట్ రాకపోయినా, సరైన ప్రాతినిధ్యం దక్కడం లేదని భావించినా, ఇతర ప్రయోజనాలు కనిపించిన వెంటనే గోడ దూకుతారు. ఈ భూతం పేరు చెబితే నాయకులకు ముచ్చెమటలు పట్టాల్సిందే. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఈ ఫిరాయింపుదారులదే హవా నడుస్తుంది.

సై అంటే..సై

● శాసనసభ ఎన్నికల్లో నానాటికీ పెరుగుతున్న అభ్యర్థుల సంఖ్య
● రాజకీయాల్లో అధికమవుతున్న పోటీతత్వం..

హన్మకొండ అర్బన్: ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో కొందరు.. వారసత్వంగా మరికొందరు.. సమాజ మార్పే ధ్యేయంగా ఇంకొందరు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో ఉంటున్నారు. వివిధ రూపాల్లో నిత్యం అలుపెరుగని పోరాటాలు చేస్తూ సందర్భానుసారం సాధారణ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. దీంతో రాజకీయాల్లో రోజురోజుకు పోటీతత్వం పెరుగుతోంది. దీనికి నిదర్శనమే ఈ సంవత్సరాల్లో జరిగిన సాధారణ ఎన్నికలు. 2009.. 2014.. 2018 వరుసగా జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో వివిధ రాజకీయపార్టీల నుంచి పోటీ చేసేవారితోపాటు స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2009 నుంచి ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య, అందులోని ఆసక్తికర అంశాలు ఒకసారి పరిశీలిస్తే..

- 2009లో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలకు మొత్తం 136 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
- 2014లో 154 మంది బరిలో నిలిచారు.

నియోజకవర్గం	2009	2014	2018	2023
జనగామ	12	19	15	19
స్టేషన్‌ఘన్‌పూర్	11	10	08	19
పాలకుర్తి	12	14	18	15
డోర్నకల్	09	08	11	14
మహబూబాబాద్	10	13	11	12
నర్సంపేట	11	12	11	16
పరకాల	10	14	15	28
వరంగల్(ప)	15	16	21	15
వరంగల్(తూ)	15	13	21	29
వర్ధన్నపేట	14	12	15	14
భూపాలపల్లి	18	12	14	23
ములుగు	09	11	12	11
మొత్తం	136	154	172	215

- 2009లో అత్యధికంగా భూపాలపల్లి నియోజకవర్గానికి 18మంది అభ్యర్థులు పోటీచేయగా అతి తక్కువ మంది డోర్నకల్, ములుగు స్థానాలకు 9 మంది చొప్పున పోటీచేశారు.
- 2014లో జనగామకు అత్యధికంగా 19 మంది అభ్యర్థులు, డోర్నకల్‌కు అతి తక్కువగా 8మంది పోటీ చేశారు.
- 2018లో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమలో మాత్రమే 21 మంది చొప్పున అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గత మూడు సాధారణ ఎన్నికల్లో ఇవే నియోజకవర్గాల నుంచి అత్యధిక అభ్యర్థులు పోటీ చేశారు. కాగా, అత్యధిక మంది అభ్యర్థులు పోటీ చేసిన నియోజకవర్గాలుగా తూర్పు, పశ్చిమలు రికార్డ్ నెలకొల్పాయి.



2023 సాధారణ ఎన్నికలకు సంబంధించి స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల్లో కొన్ని...